"ఛీఛీ గాయత్రితో సమానమైన సంధ్యా వందనంలాటి మార్నింగ్ వాక్‌ని తుచ్ఛమైన నీచమైన వ్యాపార సినిమా కళతో పోలుస్తావా?'

'సినిమాల్లో ఆ ఎగరడాలు ఆ పరిగెత్తడాలు ఆ కొట్లాటలు అవన్నీ ఎక్సర్‌సైజులే కదా - సినిమా హాలు దగ్గర టిక్కెట్లు తీస్తే అది ఒకటోరకం వ్యాయామం. రిజర్వేషన్ లేకుండా రైలు ఎక్కితే అది యింకోరకం వ్యాయామం. సిటీబస్సుల్లోకి దూరి యువతలకు వస్తే అది మరోరకం వ్యాయాయం. ఎన్నో అసౌకర్యాల మధ్య యింకెన్నో వ్యాయామాలుండగా 'మార్నింగ్‌వాక్' ఒక్కటే వ్యాయామం అంటే నేనొప్పుకోను' అన్నా. అప్పుడు శ్రీవారికి ముక్కుమీదకి కోపం వచ్చినట్లుంది - "ఏం పని లేకుండా తిరిగేవాళ్ళని పోరంబోకులంటారు కాని మార్నింగ్ వాక్‌కి వెళ్ళేవాళ్ళని అల్లా అన్రు."

ఊరికే పెద్ద పనులున్నట్లు దేశాలట్టుకు తిరిగే వాళ్ళని దేశద్రిమ్మర్లు అంటారు కాని ఉదయమే లేచి కార్లో బయల్దేరి గ్రవుండ్సుకి వెళ్ళి అక్కడ రవుండ్సు కొట్టేవాళ్ళని వేగబాండ్స్ అనజాలరు. ఓసీ మూర్ఖురాలా? ఇదిగో తెలుసుకో - గుళ్ళోకి కొబ్బరి కాయట్టుకు నడిస్తే అది పవిత్రమైన వాకింగ్, సినిమాకు చుక్కల చీర కట్టుకుని నడిస్తే అది సినీవాక్, రైలు స్టేషన్కి క్రాసింగ్ బ్రిడ్జిమీద నడిస్తే అది జర్నీ వాక్ - యిది యీ మార్నింగ్‌వాక్ మనసుకు ఉల్లాసాన్నిచ్చి రోజంతా తాజాగా చురుగ్గా వుంచే 'వాకింగ్ మానసోల్లాస' అంటారు.

'టాకింగ్ కంటె వాకింగ్ బెస్ట్ - యిది గుర్తుంచుకో' అని సవాల్చేశారు.

'ఆడవాళ్ళు మనసులోకి నడిచి హృదయాల్లోంచి బయటకొస్తారు - ఇంతకీ ఆడదాని నడకలోని అందాన్ని ఆ వయ్యారాన్ని రోజూ మార్నింగ్ వాక్‌లో బయటపెట్టేస్తే -'

రేడియోలోంచి 'సామజవరగమన' వస్తోంది. పెళ్ళాంతో మార్నింగ్‌వాక్ ఈ జన్మకింతే - అని వూరుకున్నారు నెత్తిమీద గోక్కుంటూ.

# 'దూదూదూదూ యెంకన్న'

బూరెలోకి పూర్ణం చేరినట్లు కొత్త సంవత్సరం హడావిడిలోకి మెత్తని మేనత్తలా సంక్రాంతి దూరి పోతుంది. 1986 వేయబోయి కొందరు ఇంకా 1985 వేసికొట్టేసి చివాట్లు తింటూ వుండగానే సంక్రాంతిలక్ష్మి 'దూదూదూదూ యెంకన్నా' అంటూ గంగిరెద్దుతో సహా గంగడోలు ఆడించుకుంటూ వచ్చేస్తుంది. ఈ రోజుల్లో గంగిరెద్దు వచ్చి దణ్ణం పెట్టినా ప్రభువులు పట్టు శాలువలూ కప్పరు, కాలికి కాసులూ మువ్వలూ అసలే కట్టరు. గంగిరెద్దుల్నీ ఆ ఆటల్నీ చూసి ఆనందించే రోజులు వెళ్ళిపోయాయ్, వెళ్ళిపోయాయ్, వెళ్ళిపోయాయ్.

కొత్త సంవత్సరం అంటే మాచిన్నప్పుడు పంచాంగాలు రావడం, కొత్తబట్టలు కట్టుకోవడం, వేపపచ్చడి తినడం అంతా ఉగాదితోటే-ఆంధ్రపత్రిక వాళ్ళ సంవత్సరాది సంచికలు చదువుకోడం కూడా ఉగాది ప్రత్యేకత - ఇప్పుడు కొత్తసంవత్సరం క్రిస్మస్ వెనకాల తోడు పెళ్ళి కూతుర్లా ఇంగ్లీషు సరదాల్తో ప్రవేశిస్తోంది. రాత్రి 12 గంటలు దాటగానే ఏ నగరంలో చూసినా కోలాహలమే - వీథుల్లో గ్రీటింగ్స్ చెప్పుకుంటూ వయోభేదం లేకుండా ఆడామగా చిన్నపెద్దా అంతా పొలోమంటూ తిరగడమే!

ధనుర్మాసం వచ్చిందంటే దద్ధోజనాలు, పులిహోరలూ, చక్రపొంగళ్ళూ తెల్లవారుఝామున లేచి గుళ్ళోకెళ్తే పెట్టేవారు. గుళ్ళో పెట్టిన ప్రసాదాల రుచి ఇంట్లో చేయించుకుని మెక్కితే వుంటుందా? అంతకు ముందుకార్తీక సమారాధనలని వనభోజనాల్ను తోటల్లో పెట్టేవారు. వనభోజనాల్లో వేడివేడి గుమ్మడి కాయముక్కల పులుసు కలుపుకుంటుంటే పాశ్చాత్య దేశాల వారికి ఈ గుమ్మడికాయ పులుసు ముక్కల రుచి తెలియదు గదా అని జాలేస్తుంది. ఆ హేంబర్గర్లు, కేకులు, రస్కులు ఎన్నయినా ఒక్క మన పులిహోరతో కాని, దద్ధోజనంతో కాని, గుమ్మడికాయ ముక్కల పులుసుతో కాని పోటిపడగలవా అని నాకోడవుటు! చింతచిగురుపప్పు వుందనుకోండి, చారులో ములక్కాడలున్నాయనుకోండి, మెట్టవంకాయ బండ పచ్చడి వుందనుకోండి, అంతెందుకు మావిడి కాయపప్పు దిగక ముందు దోసకాయపప్పు (కొత్తకోడలు రాకముందు ఇంట్లో పెద్దకోడలులాగ) చేశారనుకోండి - మన భోజన కల్చర్లో దేని స్టేటస్ దానిదే చదరంగంలోలాగ. చదరంగంలో ఏనుగు నడక ఏనుగుది, శకటునడక శకటుది, బంటుగారి పవర్స్ బంటుగారివి అల్లాగ. మీరు బోయినాలమీద కెళ్ళిపోయారు అని మీరు ముఖం చిట్లిస్తారనుకోండి - అయితే పిన్నిగారూ, ఎంతగొప్ప మీటింగు జరిగినా, ఎన్ని ఉపన్యాసాలు ఢణుకులెగిరిపోయేలాగ ప్రేలినా భోజనానంతరం భగవద్గీతోపన్యాసంలా కాకుండా, సభానంతరం షడ్రసోపేతమైన విందు లేక పోతే అంతా జావకారి పోయినట్లుంటుంది. పెళ్ళిలో మంగళహారతి దగ్గర మనవాళ్ళు ఫెయిలయినట్లు (లోపల్లోపల ప్రతి వదినగారూ తానో లతామంగేష్కర్ నో సుశీలనో అనుకుంటుంది) మీటింగానంతర బోయినాలు ఏడిసినట్లుంటే అంతా దుఃఖాంతమైన ట్రాజడీగా మనం భావించాలి. పూర్వం కొందరిళ్ళలో భోజనాలు జరిగేవి. ఫలానా వారింట్లో ఫలానా ప్రసాదం బ్రహ్మాండం అంటే ఆ బ్రహ్మాండమే గుర్తుండేది. గుళ్ళో ప్రసాదాలు ఫెయిలయితే భక్తులెంత డిజప్పాయింట్ అవుతారు?

ప్రసాదాలు పోయి ఇప్పుడు బ్రేక్‌ఫాస్టు, లంచి, నాస్తా అని వ్యవహరిస్తున్నారు. పెళ్ళి ఎంత ఘనంగా ఎన్ని లక్షలు ఖర్చు పెట్టి చేసినా విందు భోజనాలు బావులేక పోతే అంతా ఫెయిలయినట్లే-ఇప్పుడు ప్రతి పత్రిక లోనూ సస్పెన్స్ థ్రిల్లర్ నవల్లాగ, ప్రతి డిన్నర్‌లోనూ విజిటబుల్ బిర్యానీ, ఉల్లిపాయ పెరుగు పచ్చడి (సీతా అనసూయల్లాగ) ఎ మస్ట్‌గా వడ్డించేస్తున్నారు. దాన్తో సాంబారు కూడా చేరి, ముక్కల పులుసుని ముక్కట్టు గుని వెనక్కు నెట్టేసినట్లు కనిపిస్తోంది. అరిటాకులో భోంచేయడానికి, అరిటిదొప్పలతో కుట్టిన ఆకులో

తినడానికి, తామరాకులో, అడ్డాకులో భోంచేయడానికి తేడా లేదా? వెండి కంచంలో తినడానికి స్టీలు కంచంలో తినడానికి పట్టుచీరకీ పాలియస్టర్ చీరకీ వున్నంత తేడా వుంది. భోజనానికి విస్తరాకు పత్రికకి కవర్ పేజీ అంత ముఖ్యమైనది. ఒకే కంచంలో ముద్దలు చేసి చంద్రుని చుట్టూ నక్షత్రాల్లాగ పిల్లల్ని ఆ కంచం చుట్టూ కూచో బెట్టుకుని తల్లులు అన్నాలు వాయ ఆఫ్టర్ వాయగా తినిపించేవారు. ఆవకాయ, గోంగూర పచ్చడి, పెరుగన్నం ఇలా ఎన్ని ముద్దలయినా పిల్లలు గుటుకూ గుటుకూమని మింగేస్తారు. మన బోయినాల్లో మన కుటుంబ జీవనంలో బోల్డు సామ్యవాదం వుంది జాగ్రత్తగా ఎరుపు కళ్ళద్దాలు తీసి వెతికితే-మనకి వున్నదాన్లో వున్నంత ఇతరులకి పెట్టి మనం తినడం మన ఆచారం. దానాలు ధర్మాలు చేయడం బూర్జువా సంస్కృతి అని అది పేదలను శాశ్వతంగా దరిద్రులుగా వుండిపొమ్మని అగ్రవర్ణాలవారు ఆశించడమేనని అది కుట్ర అని మా చైనా మావయ్య గర్జిస్తూ వుంటాడు.

ఈ భూ ప్రపంచకంలో మగాళ్ళనీ ఆబాల గోపాలాన్నీ ఏడిపించడానికి ఆడవాళ్ళ చేతిలో వున్న ఏకైక ఆయుధం పాశుపతాస్త్రంలాటిది 'తలంటు', ఈ తలంట్లనేవి చైనాలో గాని రష్యాలో గాని, తూర్పు యూరప్ దేశాల్లో కాని వున్నట్టు కనపడదు. ఈ తలంట్లకు జడిసే బౌద్ధమతస్థులు గుండు కొట్టించుకోడం ప్రారంభించారని నా అనుమానం. తలంట్లను వ్యతిరేకించడం కోసమే అయ్యప్ప భక్తులు జుట్లు మీసాలు పెంచుకుని తిరిగేది. మనం చేస్తే స్నానం అయేది అది దేవుళ్ళకు అభిషేకం అవుతుంది కాబోలు. తిరుపతి వెంకన్న కూడా ఈ అభిషేకాలూ అభ్యంగనాలూ తప్పించుకోలేక పెద్దపెద్ద నామాలు పెట్టుకుని గుళ్ళో దాక్కున్నాడు. ఈ తలంటనేది మగాళ్ళకు వారివారి ఆడవాళ్ళు పోస్తే అది రమ్యంగానూ రంజుగానూ కూడా వుంటుందని పెద్దలు చెబుతారు. తలంట్లకు, నూతిగట్టా, సందులోనా, బాత్రూమా ఏది శ్రేష్ఠం అనేది వారివారి భౌతిక కారణాల మీదా కల్చర్ మీదా ఆధారపడి వుంటుంది. నదుల్లోనూ, కాలవల్లోనూ, చెరువుల్లోనూ స్నానాలు చేసేవారి లాజిక్ మరోలా వుంటుంది. ఇది తెలీకే ఆడాళ్లూ మగాళ్లూ స్నానాలు చైడం చూపించడానికి సినిమా బ్రదర్స్ వాళ్ళ సిస్టర్స్ మీద లక్షలకు లక్షలు తగలేస్తూ వుంటారు. స్నానం చేశాకే ఏ మంచి పనయినా అని మనవాళ్ళు మన క్లయిమేటు దృష్టిలో వుంచుగుని పెట్టారు.

తలంటు పోసుకోవడానికి తటపటాయిస్తాం గాని తలంటు పోసుకున్నాక వేడివేడి సాంబారిడ్లీ లేదా జీడిపప్పు వేసి నిమ్మకాయ పిండిన వుప్మా రవ్వతో చేసినది తింటూవుంటే కైలాసగిరి శిఖరంమీద పచార్లు చేసినంత హాయిగా వుంటుంది. పకోడీలుకాని బజ్జీలు కాని వుల్లిపాయవడలు కాని మధ్యాహ్నం నిద్రపోయి లేచాక లాగించాలి.

నేటి యువతరం తలంట్లంటే మైలుదూరం పరిగెడుతున్నారు. కొత్తబట్టలు కావాలి కాని తలంటు అక్కర్లేదు అంటే ఎలాగ? లడ్డు, అరిసెలు, మినపసున్ని వుండలూ తినలేరు - పట్టుమని నాలుగైదు మైళ్ళు నడవలేరు. మనం నడవకుండా దేశం ఎలా ముందుకు నడుస్తుంది?

వెనక మావారి తలంట్ల దొడ్డమ్మగారు బాగా పెద్దయాక మావారి గదిలోపడుకున్న ఆయన ఫ్రందుని రెక్క పుచ్చుగు బలవంతాన లాక్కువెళ్ళి తలంటోసేసిందట. ఆవిడ సప్తఋషుల్నీ రెక్కపుచ్చుకులాక్కొచ్చి 'వెర్రి నాయన్లారా ఆ గడ్డాలూ మీరు మిమ్మల్ని చూస్తే నాకు ఏడుపొస్తోంది. వుండండి శుభ్రంగా తలంట్లోస్తాను–' అని తలంట్లు పోసి సాంబ్రాణి పొగవేసి చెరో మినప సున్ని వుండ చేతిలో పెట్టి వాళ్ళని పైకి పంపించెయ్యగలదు.

అసలన్నిట్లోకి కుక్కకి తలంటొయ్యడం చాలాకష్టం– అన్నట్లు అదిగో మావారొస్తున్నారు. అడిగిన వరాలిచ్చేసి వారిని తలంటుకు కూచోపెట్టాలి. ఎవర్రా అక్కడ – కుంకుడు కాయలు కొట్టండి!

# శివం - శైశవం

పిల్లల్ని 'వాచ్' చేస్తూంటే వాళ్ళు 'ట్వింకిల్ ట్వింకిల్ లిటిల్ స్టార్స్'లానూ 'డింగ్ డాంగ్ బెల్లు'లానూ కాక 'లిటిల్ స్కవుండ్రల్సు'లా కనిపిస్తారు. చుట్టూ వున్న ప్రపంచంలోంచి వారిదైన ప్రపంచాన్ని వాళ్ళు అవలీలగా సృష్టించుకోగల్రు. ఆడవాళ్ళ ప్రపంచంలో పిల్లల ప్రపంచం ఓ భాగం అనొచ్చు. 'ఉడుతల్లారా బుడుతల్లారా అయిదారేడుల పాపల్లారా' అని శ్రీశ్రీ గారు కీర్తించారంటే – పిల్లలు పెద్దలకి కాదు కాదు – లిటిల్ రాస్కెల్సు పెద్ద రాస్కెల్సుకి ఆధ్యాత్మిక గురువులేమోనని అనిపిస్తుంది. జాగర్తగా ఆలోచించే వర్డ్స్ వర్త్‌గారు 'చైల్డ్ ఈజ్ ఫాదర్ ఆఫ్ ది మాన్' అన్నారేమో!

మొన్నీ మజ్య రైల్లో 'నిద్రించు పెట్టె'లోకి ఎక్కగానే మా బెర్త్ మీద అంతా పిల్లలూ తల్లులూ బైఠాయించారు. వాళ్ళని అడిగితే మాకు రిజర్వేషనేవిటి ఏలూర్లో దిగుతాం ఆ తర్వాత మీరు సర్దుకొండి అన్నారు. అన్నవాళ్ళు బెర్తులు కొనుక్కున్నవాళ్ళని బభ్రాజమానుల్లా కట్టి రాజమండ్రిదాకా మీ రెక్కడైనా తలదాచుకొమ్మన్నట్లు నిష్పూచీగా పేచీకి దిగారు. టిక్కెట్ ఎగ్జామినర్ కూడా వాళ్ళ జోలి మీకెందుకు సర్దుకు పొమ్మన్నట్లు 'హి హ్హిహ్హీ' అన్నాడు. సందట్లో సడేమియా అని ఈ మధ్యలోకి మరొ కావిడ వచ్చి పిల్లల్ని అందరిమీదా ఎక్కించి ఇరుక్కుని అక్కడే కూచుంది. ఆవిడగారి ఆడపిల్ల లిద్దరూ ఒక మగపిల్లాడు పెట్టి అంతా తమదే అన్నట్లు సిసింద్రీలు సీమటపాకాయల్లా అల్లరి చేస్తూ అరుస్తూ గీపెడుతూ తిరిగేస్తున్నారు.

రైళ్ళలో ప్రయాణం చేసేవారికన్నా, కంపార్ట్‌మెంట్లలో అవీ ఇవీ అమ్ముకుంటూ తిరిగే వారికి ఎక్కువ తెలివితేటలుంటాయి. ఆ ఇల్లాలు పిల్లల్ని నీటుగా రబ్బరు బొమ్మల్లా ముస్తాబు చేసింది. వరసగా కానుపులేమో చిన్నా చితకా ఒకరికీ మరొకరికీ తేడా అట్టేలేదు. కాస్తావున్న